సాక్షి అనంతపురం

బుధవారం । 16 । జూలై । 2025



పెన్షనర్లపై ప్రభుత్వాల దాడి

ఆర్థిక ప్రయోజనాలు అందించకుండా పెన్షనర్లపై ప్రభుత్వాలు దాడులకు దిగుతున్నాయని పలువురు వాపోయారు.

8లో



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

సబ్ రిజిస్ట్రార్ మహబూబ్‌అలీకి ఇంక్రిమెంట్ల నిలుపుదల

కర్నూలు(సెంట్రల్): గుత్తి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఎస్.మహబూబ్‌అలీకి ఐదు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు అనంతపురం డీఐజీ లోకాయుక్తకు నివేదించారు. గతంలో కర్నూలు జిల్లా కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా మహబూబ్‌అలీ పనిచేసిన సమయంలో 136 పత్రాలకు సంబంధించి మార్కెట్ విలువను తక్కువగా చూపడంతో ప్రభుత్వ ఖజానాకు రూ.53,01,796 నష్టం జరిగినట్లు కర్నూలులోని బంగారుపేటకు చెందిన బీపీ జాన్ లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు. దీనిపై లోకాయుక్త 858/2013/బీ2గా ఫిర్యాదును నమోదు చేసి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీని విచారణాధికారిగా నియమించింది. విచారణలో అక్రమాలు నిజమేనని తేలడంతో సదరు సబ్ రిజిస్ట్రార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రేషన్ శాఖను లోకాయుక్త ఆదేశించింది. ఆ మేరకు సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకున్నట్లు మంగళవారం లోకాయుక్తకు అనంతపురం డీఐజీ నివేదించడంతో కేసును మూసివేస్తున్నట్లు ఉప లోకాయుక్త పి. రజని తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

గుత్తి: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో మంగళవారం కర్నూలు జిల్లాకు చెందిన విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ ఎస్ఐ వీరేంద్ర భూపతి, ఏడీఏ సాలురెడ్డి, గుత్తి ఏడీఏ వెంకటరాముడు, ఏఓ ముస్తాక్ అహమ్మద్ పాల్గొన్నారు. బాలాజీ ఫర్టిలైజర్ షాపులో ఎరువుల స్టాక్ వివరాలు సరిగా లేకపోవడంతో వాటి విక్రయాలను నిలుపుదల చేస్తూ నోటీసులు జారీ చేశారు.

జిల్లాకు వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్/ బుక్కరాయసముద్రం: రాగల ఐదు రోజులూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త జి.నారాయణస్వామి తెలిపారు. ఈనెల 16 నుంచి 20 వరకు 2 నుంచి 25 మి.మీ మేర సగటు వర్షపాతం నమోదు కావొచ్చన్నారు. ఈనెల 18న 25 మి.మీ,19న 15 మి.మీ, 20న 10 మి.మీ మేర మోస్తరుగా వర్షం పడే సూచన ఉందని పేర్కొన్నారు.

18న తాడిపత్రిలో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పాత వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఈనెల 18న 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. మంగళవారం జరగాల్సిన కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు వెల్లడించారు. 18న జరిగే కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.

ఉద్యానం.. అధ్వానం

జిల్లా ఉద్యాన శాఖ పరిస్థితి అధ్వానంగా తయారైంది. కూటమి సర్కారు భారీ బడ్జెట్ కేటాయిస్తున్నట్లు కాగితాల్లో చూపిస్తున్నా... అందులో సగం కూడా ఖర్చు చేయడం లేదు. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

- కాగితాల్లోనే పథక నిర్దేశన, బడ్జెట్ కేటాయింపులు
- గతేడాది రూ.18.87 కోట్లకు గానూ రూ.7.98 కోట్లే ఖర్చు
- ఈ ఏడాది రూ.16.14 కోట్లలో సగం ఖర్చు కూడా అనుమానమే
- సర్కారు తీరుతో ఇబ్బందులు పడుతున్న రైతులు



అనంతపురం అగ్రికల్చర్: చంద్రబాబు ప్రభుత్వం ఒక చేత్తో బడ్జెట్ చూపించి మరో చేత్తో వెనక్కి లాగేసుకుంటూ రైతులకు ఫలాలు అందకుండా చేస్తోంది. 2024–25లో పథకాలు, బడ్జెట్ కేటాయింపులు, ఖర్చు చేసిన సొమ్ము, సాధించిన ప్రగతి చూస్తే... కూటమి సర్కారు నిర్లక్ష్యం, ఉద్యానశాఖ పనితీరు స్పష్టంగా అర్థమవుతుంది. గతేడాది జిల్లాలో ఉద్యానశాఖ ద్వారా అమలు చేసే పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18.86 కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించింది. అందులో సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం (ఎంఐడీహెచ్) కింద 7,820 మంది రైతులకు సంబంధించి రూ.15.23 కోట్లు కేటాయించినా... ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.7.10 కోట్లు వెచ్చించి 3,950 మందికే ఫలాలు అందించారు. రాష్ట్రీయ కృషి వికాస యోజన (ఆర్‌కేవీవై) కింద నాణ్యమైన కూరగాయల విత్తనాల పంపిణీకి రూ.1.30 కోట్లు కేటాయించగా ఖర్చు చేసింది మాత్రం రూ.8.50 లక్షలు కావడం గమనార్హం. ఆయిల్‌ఫాం కింద కణేకల్లు, కూడేరు, బొమ్మనహాళ్, ఉరవకొండ, వజ్రకరూరు, డీ.హీరేహాళ్ మండలాల్లో పామాయిల్ తోటల అభివృద్ధికి రూ.2.31 కోట్లు కేటాయించగా... కేవలం రూ.79 లక్షలు ఖర్చు చేశారు. ఎన్‌బీఎం, సీడీబీ కింద రూ.2.87 కోట్లు కేటాయించగా రూ.1.31 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఇలా గతేడాది రూ.18.87 కోట్లు కేటాయించగా చివరకు రూ.7.98 కోట్లు ఖర్చు పెట్టారు. ఈ క్రమంలో ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు వివిధ పథకాల కింద రూ.16.14 కోట్లు మేర బడ్జెట్ కేటాయించారు. ఈ సారి సగం కూడా ఖర్చు చేసే పరిస్థితి లేదని చెబుతున్నారు.

విస్తీర్ణంలో టాప్..

జిల్లాల విభజన జరిగిన తర్వాత కూడా ఉద్యాన తోటల విస్తీర్ణంలో 'అనంత' మొదటి స్థానంలో ఉంది. యాపిల్ లాంటి నాలుగైదు రకాలు మినహా మిగతా అన్ని రకాల ఉద్యాన తోటలకు నిలయంగా మారింది. జిల్లా నుంచి చీనీ, అరటి, దానిమ్మ, టమాట, గులాబీ తదితర ఉత్పత్తులు ఉత్తరాది రాష్ట్రాలతో పాటు విదేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి. ఢిల్లీలో పేరున్న అజాద్‌పూర్ మండీలో 'అనంత' ఉద్యాన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. వేలాది మంది ఉద్యాన రైతులు, లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు, రూ.వేల కోట్ల టర్నోవర్ పరంగా జిల్లా అగ్రస్థానంలో కొనసాగుతోంది. వేలాది మంది రైతులు వ్యవసాయ పంటలను తగ్గించి అంతో ఇంతో నీటి వనరుల కింద పండ్లు, పూలు, కూరగాయలు తదితర ఉద్యాన పంటలు సాగు చేస్తున్న పరిస్థితి నెలకొంది. తాజా నివేదికల ప్రకారం 3 లక్షల ఎకరాల్లో ఉద్యాన తోటలు ఉండగా... అందులో 1.80 లక్షల ఎకరాల్లో పండ్లతోటలు, 55 వేల ఎకరాల్లో కూరగాయ పంటలు, 40 వేల ఎకరాల్లో సుగంధం, ఔషధ పంటలు, పూలతోటలు సాగులో ఉన్నాయి. ఏకంగా 72 రకాల ఉద్యాన తోటలు సాగవుతున్నట్లు ఈ–క్రాప్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. వాటి ద్వారా ఏటా 38 లక్షల మెట్రిక్ టన్నుల మేర ఫలసాయం వస్తోంది. రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు టర్నోవర్ ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వర్షాభావ పరిస్థితులు, ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పుల కారణంగా చీడపీడలు, తెగుళ్ల బెడద అధికంగా ఉంటోంది. అకాల వర్షాలు, ఈదురుగాలులు ఏటా దెబ్బతీస్తున్నాయి. అలాగే మార్కెటింగ్ సమస్య రైతులను వేధిస్తోంది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ఉద్యాన తోటలు సాగు చేస్తున్న రైతులకు బాసటగా నిలవాల్సిన కూటమి సర్కారు, ఉద్యానశాఖ కంటితుడుపుగా పథకాలు అమలు చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోండి



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: మండల, గ్రామస్థాయి అధికారులు ఒక్కో బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. పీ–4, 'తల్లికి వందనం', 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' తదితర అంశాలపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి డ్వామా పీడీ, జెడ్పీ సీఈఓ, డీపీఓ, ఆర్‌డీఓలు, డీఎల్‌డీఓల, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు, వ్యాపారులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా దత్తత తీసుకునేలా చూడాలన్నారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరు కంబదూరు మండలంలో 57 శాతమే ఉందని, అన్ని చోట్ల వందశాతం నమోదు కావాలని ఆదేశించారు.

నష్టం జరిగితే కాంట్రాక్టర్‌దే బాధ్యత

'పంప్‌హౌస్‌లో, పైప్‌లైన్లలో నీరులేకపోతే అవి పగిలిపోయే అవకాశం ఉంది. అలా జరిగేతే కాంట్రాక్టర్ బాధ్యత వహించాలి. వారి నుంచి ఆ నష్టాన్ని రికవరీ చేయాలి' అని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమీక్షించారు. శ్రీరామిరెడ్డి నీటి పథకం కింద రూ.3.83 కోట్లు కాంట్రాక్టర్ ఖాతాలో జమయ్యాయని, కార్మికులకు బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మావాళ్లకు ఇవ్వకుంటే ఇక మీ ఇష్టం!

- సమగ్రశిక్ష అధికారులపై ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ''మీరు ఏం చెప్పినా వినను. నేను చెప్పిన పేరు తుది జాబితాలో ఉండాలి. సెక్టోరియల్ అధికారిగా కూర్చోవాలి అంతే.అలాగైతేనే దరఖాస్తులు స్క్రూటినీ చేయండి. లేదంటే పక్కన పడేయండి. అంతేకాని అర్హత లేదని రిజెక్ట్ చేశారో మీ ఇష్టం...'' సమగ్రశిక్ష అధికారులకు ఇటీవల జిల్లాలోని ఓ ఎమ్మెల్యే ఫోన్ చేసి మాట్లాడిన మాటలివి. సదరు ఎమ్మెల్యే సిఫార్సు చేస్తున్న వ్యక్తి గతంలో పోక్సో కేసులో రిమాండ్‌కు వెళ్లొచ్చాడు. అయినా, అలాంటి టీచర్‌కే పోస్టు కేటాయించాలని ఒత్తిడి చేస్తుండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలోని చాలామంది ఎమ్మెల్యేలు ఇదే విధంగా 'తమ వారి' కోసం ఫోన్లు చేస్తుండడంతో ఎటూ పాలుపోక గిలగిలా కొట్టుకొంటున్నారు. సమగ్రశిక్ష కార్యాలయంలోని ఆరు సెక్టోరియల్ అధికారుల పోస్టుల భర్తీకి గతనెల 24న నోటిఫికేషన్ జారీ చేశారు. అదేనెల 30 వరకు గడువు విధించారు. మొత్తం 172 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటిదాకా కనీసం వాటిని పరిశీలించలేదు. స్క్రూటినీ చేసి అర్హులు, అనర్హులను తేల్చాల్సి ఉంది. అయితే, పోస్టులకు సంబంధించి ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న ఒత్తిళ్లతో దరఖాస్తుల జోలికి వెళ్లేందుకు అధికారులు వణికిపోతున్నారు.

గత డీపీసీ నిర్వాకం..

సెక్టోరియల్ అధికారుల పోస్టుల భర్తీలో పాటించాల్సిన విధివిధానాలపై 2024లో విద్యాశాఖ ప్రిన్సిపల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అప్పటి డీఈఓ/డీపీసీ వరలక్ష్మి తనవారికి లబ్ధి చేకూర్చేందుకు ఇష్టారాజ్యంగా నిబంధనలు అమలు చేశారు. ఉద్యోగులను విద్యాసంవత్సరం మధ్యలో రిలీవ్ చేయొద్దని, వేసవి సెలవుల్లో మాత్రమే రిలీవ్ చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నా పట్టించుకోకుండా అప్పట్లో రాత్రికిరాత్రి అందరినీ రిలీవ్ చేసేశారు. ఇలా అప్పట్లో వరలక్ష్మి ఒంటెద్దు పోకడలతో ముందుకు వెళ్లడం.. ఆ తర్వాత కొత్తవారిని తీసుకోకపోవడంతో ఏడాది కాలంగా సెక్టోరియల్ అధికారులు లేని సమగ్రశిక్ష కార్యాలయంగా మారింది.

ముఖ్య పోస్టులన్నీ ఖాళీనే..

విద్యా సంవత్సరం ప్రారంభంలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి వారందరినీ బడుల్లో చేర్పించేలా సమన్వయం చేయాల్సిన అధికారి అలెస్కో. ఈ పోస్టు ఖాళీగా ఉంది. అలాగే విద్యార్థి కిట్ల సరఫరాలో సీఎంఓది కీలక పాత్ర. మెగా పీటీఎం నిర్వహణ బాధ్యత కూడా సీఎంఓదే. ఈ పోస్టూ ఖాళీనే. ఉపాధ్యాయుల శిక్షణలను పర్యవేక్షించాల్సిన ఏఎంఓ పోస్టు, అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ), ఐఈ కోఆర్డినేటర్, ఏఎస్ఓ పోస్టుల్లో ఒక్కటీ భర్తీ చేయలేదు. ప్రస్తుతం ఏఎంఓ, జీసీడీఓ, అసిస్టెంట్ ఏఎంఓ మాత్రమే పని చేస్తున్నారు.

ఏపీసీకి అవస్థలు ..

10 మంది చేయాల్సిన పనులను ఒకరిద్దరితో చేయించలేక ఏపీసీ శైలజ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో రోజుకో కార్యక్రమం అమలు చేయాలంటూ రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు అందుతున్నాయి. ఇక్కడేమో సెక్టోరియల్ అధికారులు లేక అల్లాడిపోతున్నారు. ఈ విషయం రాష్ట్ర అధికారులకూ తెలుసు. అయినా ఏడాదిగా చోద్యం చూస్తున్నారు తప్ప గట్టి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్




విలేకరులతో మాట్లాడుతున్న మాధవ్, పెద్దారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: పోలీసులు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ అన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నివాసంలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, గోరంట్ల మాధవ్ విలేకరులతో మాట్లాడారు. మాధవ్ మాట్లాడుతూ తాడిపత్రిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమావేశానికి కూటమి ప్రభుత్వం డైరెక్షన్‌లో పోలీసులు ఆంక్షలు విధించడం సరికాదన్నారు. వైఎస్సార్ సీపీకి 2019లో 151 ఎమ్మెల్యేలు, 22 ఎంపీ సీట్లు అందించి ప్రజలు ఆశీర్వదించారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీలకు సమావేశాలు, సభలు, కార్యక్రమాలు నిర్వహించుకునే సౌలభ్యం కల్పించారన్నారు. కానీ అందుకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు. సమావేశం నిర్వహణకు పోలీసులు అవకాశం కల్పించాలన్నారు. గుడివాడలోనూ తమ పార్టీ నేత కొడాలి నాని కార్యక్రమానికి వెళ్లకుండా ఆంక్షలు విధించారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ విప్లవాన్ని తీసుకువచ్చారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. అలవిగాని హామీలతో చంద్రబాబు అధికారంలోకి వచ్చి నేడు ప్రజలను మోసం చేశారన్నారు. గత ప్రభుత్వం చేసిన మేలును, కూటమి ప్రభుత్వ నయవంచనను ప్రజలకు తెలియజేసేందుకు వైఎస్సార్ సీపీ అధిష్టానం 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమానికి పిలుపునిచ్చిందని, కార్యక్రమంలో భాగంగానే తాడిపత్రిలో సమావేశం ఏర్పాటుకు నిర్ణయించామన్నారు. ఈ నెల 18న ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారని ఆయన పేర్కొన్నారు.

వసతుల్లేకుంటే.. విశ్రాంతి ధామాలా?



క్యాజువాలిటీలో ఒకే మంచంపై వైద్యం పొందుతున్న ఇద్దరు రోగులు



సర్వజనాస్పత్రి ఆవరణలో రూ.75 లక్షలతో నిర్మిస్తున్న విశ్రాంతి ధామం

- సర్వజనాస్పత్రిలో మంచాలు లేక రోగుల అవస్థలు
- సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు
- రూ. 75 లక్షలతో విశ్రాంతి ధామం నిర్మిస్తుండడంపై సర్వత్రా విమర్శలు

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రిలో రోజురోజుకూ పరిస్థితులు దారుణంగా తయారవుతున్నాయి. సౌకర్యాల కల్పనపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలోని క్యాజువాలిటీ (ఎమర్జెన్సీ వార్డు), అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ)కు వస్తున్న వారు ఇక్కడ చాలీచాలని మంచాల నడుమ ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. ఒకే మంచంపై పురుషులు, మహిళలను ఉంచి సేవలందిస్తున్న దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో పాటు పయ్యావుల కేశవ్, సవిత మంత్రులుగా ఉన్నా ఆస్పత్రిపై దృష్టి సారించకపోవడంపై జిల్లావాసులు పెదవి విరుస్తున్నారు. మరోవైపు అత్యవసర విభాగాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా రూ.75 లక్షలతో విశ్రాంతి ధామం ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ నిర్ణయించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

మాటలకే పరిమితం..

అనంతపురం నగరానికి చెందిన వ్యక్తి ఫిట్స్‌తో బాధపడుతూ మంగళవారం సర్వజనాస్పత్రికి వచ్చాడు.అదే సమయంలో అనంతపురం రుద్రంపేటకు చెందిన మహిళ జ్వరంతో ఆస్పత్రికి రాగా, మంచాలు లేకపోవడంతో వీరిద్దరినీ ఒకే మంచంపై ఉంచి సేవలందించారు. ఇలాగే, రాయదుర్గం పట్టణానికి చెందిన మహిళ, బెళుగుప్ప మండలం అడవిబాపనపల్లి తండాకు చెందిన వ్యక్తిని ఒకే మంచంపై ఉంచి వైద్యం చేయడం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది. మంచాలు చిన్నవి కావడంతో మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. క్యాజువాలిటీలో కేవలం 25 పడకలు ఉన్నాయి. నిత్యం ఈ విభాగంలో 600 నుంచి 800 మంది సేవలు పొందుతుంటారు. వివిధ సమస్యలతో వచ్చిన వారిని మొదట పీజీలు, తర్వాత అసిస్టెంట్ ప్రొఫెసర్ చూసిన తర్వాతనే వార్డులకు పంపుతున్నారు. ఈ క్రమంలో ఒక్కో రోగి రోజుల తరబడి ఎమర్జెన్సీ వార్డులోనే ఉండాల్సి వస్తోంది. అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లోనూ అదే దుస్థితి. ఈ విభాగంలో మంచం ఎప్పుడెప్పుడు ఖాళీ అవుతుందా అంటూ రోగులు ఎదురు చూడాల్సిన పరిస్థితి. సర్వజనాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో క్యాజువాలిటీ, ఏఎంసీల విస్తరణ చేపట్టాలని నిర్ణయించినా మాటలకే పరిమితమైంది.

నార్పలలో పోలీసుల ఓవరాక్షన్

నార్పల: పోలీసులు ఓవరాక్షన్ చేశారు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నేతలు వెళ్లకుండా అడ్డంకులు సృష్టించారు. పార్టీ నేత నార్పల సత్యనారాయణరెడ్డిని ఆయన ఇంట్లోనే అడ్డగించడం సర్వత్రా విమర్శలకు దారి తీసింది. వివరాలు.. మండల కేంద్రంలోని వాల్మీకి కల్యాణ మండపం పక్కన ఉన్న కమిటీ హాలులో వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి సాకే శైలజనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయితే, ఎవరో అనామకులు ఫిర్యాదు చేశారని సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్‌లు పోలీసు సిబ్బందితో వెళ్లి సత్యనారాయణరెడ్డిని ఆయన ఇంట్లోనే అడ్డుకున్నారు. ఆయనతో పాటు పార్టీ మండల కన్వీనర్ ఖాదర్ వలీఖాన్, అనుచర వర్గం బయటకు వెళ్లకుండా నిర్బంధించారు. గంటలో కార్యక్రమం ప్రారంభం కావాల్సి ఉండగా పోలీసులు ఇలా వ్యవహరించడం అనుమానాలకు తావిచ్చింది. పైగా వాల్మీకి కల్యాణ మండపం పక్కన ఉన్న కమిటీ హాలులో కాకుండా మరో చోట కార్యక్రమం ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని బెదిరింపులకు పాల్పడడం గమనార్హం. ఈ సందర్భంగా పోలీసులతో నార్పల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థ ప్రజలకు రక్షణగా ఉండాలన్నారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో నిత్యం వాల్మీకి కల్యాణ మండపంలోనే టీడీపీ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. వారం క్రితం బి.పప్పూరులోని సాయిబాబా కల్యాణ మండపంలో టీడీపీ మండలాధ్యక్షుడి ఎన్నిక జరిగిందని, టీడీపీకో న్యాయం, వైఎస్సార్ సీపీకో న్యాయమా అని నిలదీశారు. తమ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ నిత్యం ప్రజల్లో ఉంటూ వారి కష్టాలను తెలుసుకుంటున్నారని, ఈ క్రమంలో ఆయనకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు పోలీసులతో కలిసి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. తాము శాంతియుతంగానే రాజకీయాలు చేస్తున్నామని, కూటమి ప్రభుత్వం మాత్రం పోలీసులతో రాజకీయం చేయిస్తోందన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, ప్రభుత్వానికి తప్పకుండా బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వ మెడలు వంచుదాం



కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు



రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ అనంతపురం పార్లమెంటు పరిశీలకుడు నరేష్ రెడ్డి, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్, తదితరులు

- ప్రజలు వైఎస్సార్ సీపీతోనే ఉన్నారు
- పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత
- చంద్రబాబు పతనం ప్రారంభం: మాజీ మంత్రి శైలజానాథ్

గార్లదిన్నె: కూటమి ప్రభుత్వ మెడలు వంచైనా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చేలా చూడాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గార్లదిన్నె మండలం కల్లూరులో నిర్వహించిన 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ పరిశీలకుడు నరేష్ రెడ్డి, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్‌తో కలిసి ముఖ్య అతిథిగా అనంత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో అవినీతికి తావు లేకుండా పాలన సాగిందన్నారు. అర్హులకు ఏకంగా రూ.2.83 వేల కోట్లు అందించామన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయలేని సంక్షేమ కార్యక్రమాలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారన్నారు. గత ఎన్నికల్లో ఒక్క వైఎస్సార్‌సీపీకే 42 శాతం ఓట్లు వచ్చాయని, టీడీపీ, బీజేపీ, జనసేన మూడు పార్టీలకు కలిపి 58 శాతం ఓట్లు వచ్చా యన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో రూ.81 వేల కోట్ల బకాయి పడిందన్నారు. 'తల్లికి వందనం' ఒక ఏడాది కట్ చేసి, ఈ ఏడాది కొంత మందికి మాత్రమే అందించారన్నారు. ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోనున్నాయని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి కూటమి ప్రభుత్వంపై ఎప్పటికప్పుడు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు ప్రభుత్వంలో పోలీస్ శాఖ దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని విమర్శించారు. పంటలు పండక, పండిన పంటకు గిట్టుబాటు ధరలు దక్కక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో సకాలంలో ఆయకట్టుకు నీరు అందించామని, ప్రస్తుతం జూలై ముగుస్తున్నా సాగు నీరు విడుదల చేయలేదన్నారు. ఈ నెల 20 నుంచి ఆగస్టు 4 వరకూ పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

చంద్రబాబు పతనం ప్రారంభం..

శింగనమల నియోజకవర్గం నుంచే చంద్రబాబు పతనం ప్రారంభమవుతుందని సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ ధ్వజమెత్తారు. నార్పలలో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'కు అడ్డంకులు సృష్టించారని, దీంతో బస్టాండ్ సర్కిల్లో కార్యక్రమం నిర్వహించామన్నారు. వైఎస్సార్‌సీపీ వాళ్లకు పనులు చేయవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటన్నారు. మాట తప్పని, మడమ తిప్పని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన నుంచి చంద్రబాబు పాఠాలు నేర్చుకోవాలని హితవు పలికారు. బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్ల వద్దకు వెళ్లి కూటమి పార్టీ నాయకులు దాడులు చేస్తే వారికి బెయిలబుల్, అదే వైఎస్సార్ సీపీ నాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారని దుయ్యబట్టారు. రాబోయేది జగన్ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. అనంతపురం పార్లమెంట్ పరిశీలకుడు నరేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో కరోనా కష్ట కాలంలో కూడా వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలు వంద శాతం అమలు చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి, అనంతపురం రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి, జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్ రెడ్డి, శింగనమల నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు మంత్రి ఆంజనేయులు, బండ్లపల్లి ప్రతాప్ రెడ్డి, బుక్కరాయ సముద్రం జెడ్పీటీసీ భాస్కర్, మేధావుల ఫోరం అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు చీమల శీన, చితంబరరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విధుల్లోకి శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు



పీఏబీఆర్‌లో మోటర్ స్విచ్ ఆన్ చేస్తున్న కార్మికులు

కూడేరు: శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మె విరమించి మంగళవారం విధుల్లోకి చేరారు. పీఏబీఆర్‌లోని శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్‌లో మోటర్ స్విచ్ ఆన్ చేసి తాగునీటి సరఫరా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు, పీఎఫ్ చెల్లించాలంటూ కార్మికులు సాగించిన 100 రోజుల పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. కాంట్రాక్టర్ శివారెడ్డి తమతో జరిపిన చర్చల్లో బుధవారం సాయంత్రంలోపు కార్మికుల బ్యాంక్ ఖాతాల్లోకి వేతనలు, పీఎఫ్ జమవుతాయని హామీనిచ్చారన్నారు. ఇందుకు కార్మికులు సమ్మతించి విధుల్లోకి చేరారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్, ప్రాజెక్ట్ యూనియన్ నేతలు ఎర్రిస్వామి, రామాంజనేయులు, ఈశ్వరయ్య, నాగరాజు, చిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

పంటలకు బీమా తప్పనిసరి



పంటలను పరిశీలిస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం/రాప్తాడు: సాగు చేసిన పంటలకు బీమా తప్పని సరిగా చేయించుకోవాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి (జేడీఏ) ఉమామహేశ్వరమ్మ సూచించారు. బీకేఎస్ మండలం కొర్రపాడు, రాప్తాడు మండలం మరూరు, హంపాపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. పత్తి, వేరుశనగ, దానిమ్మ, బత్తాయి, టమాట, అరటి సాగు చేసిన రైతులు పంటల బీమా ప్రీమియంను మీసేవా కేంద్రాల ద్వారా చెల్లించాలన్నారు. పత్తికి ఎకరాకు రూ.1,140, వేరుశనగకు రూ.640, దానిమ్మకు రూ.3,750, బత్తాయికి రూ.2,750, టమాటకు రూ.1,600, అరటికి రూ.3 వేలు చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. కౌలు రైతులు పంటల సాగు హక్కు పత్రాలను తప్పనిసరిగా పొందాలన్నారు. పంట పొలాల్ని ఆశించే చీడపీడలు, వివిధ రకాల తెగుళ్లు, యాజమాన్య పద్ధతులను వివరించారు. రాయితీ విత్తనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేరుశనగ సాగు చేసే ప్రతి రైతూ అంతర పంట వేసుకోవాలన్నారు. కంది, ఆముదం సాగు విస్తీర్ణం పెంచుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో బీకేఎస్, రాప్తాడు మండల వ్యవసాయాధికారులు శ్యాం సుందర రెడ్డి, కృష్ణచైతన్య, పట్టు పరిశ్రమ అధికారి రమాకాంత్, చంద్రశేఖర్, వీఆర్ఓ నాగరాజు, నరేంద్రరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి సన్నిధిలో అక్రమాలు

- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పీఎఫ్, ఈఎస్ఐ నిధుల మళ్లింపు
- ఖాతాలకు జమ చేయకుండా స్వాహా చేసిన ఆలయ అధికారులు
- ఏళ్లుగా సాగుతున్న దందా విలువ రూ.కోట్లలోనే



గుంతకల్లు: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో భారీ కుంభకోణం వెలుగుచూసింది. కొన్నేళ్లుగా చాపకింద నీరులా సాగుతూ వచ్చిన ఈ కుంభకోణం విలువ రూ.కోట్లలోనే ఉండడం గమనార్హం.

చిరుద్యోగుల కష్టార్జితంపై కన్ను

నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలోని వివిధ విభాగాల్లో భక్తులకు సేవలందించేందుకు 71 మందిని ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించారు. వీరంతా ప్రస్తుతం విజయవాడ కనకదుర్గ ఏజెన్సీ కింద పని చేస్తున్నారు. దేవాలయంలో సెక్యూరిటీ, క్యూలైన్లు, వంటశాల తదితర విభాగాల్లో పనిచేస్తున్న వీరికి దేవస్థానం నిధుల నుంచి వేతనాలు మంజూరవుతాయి. ఒక్కొక్కరికి నెలకు రూ.20వేలు చొప్పున జీతం నిర్ణయించారు. ఇందులో పీఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టీ కింద రూ.6,600 మినహాయించుకుని నెలకు రూ.13,400 నికర జీతంగా చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ఈ 71 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతం నుంచి పీఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టీ పేరిట నెలకు రూ.4.68 లక్షలు చొప్పున ఏటా అరకోటికి పైగా కట్ చేసి మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తున్నారు. అలాగే కాంట్రాక్ట్ పద్ధతిలో మరో 40 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరి జీతాల్లోనూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తరహాలోనే పీఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టీ కట్ చేసి, మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తున్నారు. అయితే ఇక్కడే అసలు కుంభకోణానికి ఆలయ అధికారులు తెరలేపారు. 71 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇప్పటి వరకూ పీఎఫ్ ఖాతా, ఈఎస్ఐ కార్డులు లేవు. తమ జీతం నుంచి పీఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టీ కింద కట్ చేస్తున్న మొత్తాన్ని ఉద్యోగులకు తెలియకుండా తొక్కిపెట్టారు. ఈ మొత్తాన్ని ఆలయ అధికారులే స్వాహా చేస్తూ వచ్చారు.

ఆడిట్‌లో గుర్తింపు..

నాలుగు రోజుల క్రితం కసాపురం ఆలయ జమ ఖర్చుల ఆడిట్ జరిగింది. పీఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టీ పేరుతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల నుంచి కట్ చేసిన మొత్తం ఎక్కడ జమ అయిందో అర్థం కాక ఆడిటర్లు తలలు బాదుకున్నా అంతు చిక్కలేదు. దీంతో ఇదే విషయంపై ప్రశ్నించడంతో ఆడిటర్లను ఆలయ అధికారులు బెదిరించినట్లు సమాచారం. చూసీచూడనట్లుగా వెళ్లాలని, లోతులోకి వెళితే ఇబ్బంది పడతారంటూ హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో తమ పని తాము చేసుకుంటామని ఆడిట్ అధికారులు తెలిపి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, మూడు నెలలుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు రాకపోకడంతో ఇబ్బందులకు గురువుతున్నారు. అసలే వచ్చే అరకొర జీతంలో కోతలు పెడుతుండటంతో భారంగా నెట్టుకొస్తున్నట్లు వాపోతున్నారు. ప్రతి నెలా 10వ తేదీకి జీతం వచ్చేదని, ఈ నెల 10తో మూడు నెలలు పూర్తయినా ఇప్పటి వరకూ జీతం వేయలేదని చిరుద్యోగులు వాపోతున్నారు.

కాంట్రాక్టర్ చేతల్లోనే ఉంటుంది

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పీఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టీ కట్ చేసే అంశం కాంట్రాక్టర్ చేతల్లోనే ఉంటుంది. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను పిలిపించి మందలించాం. గత ఏడాది ఈఎస్ఐ, పీఎఫ్ చేయించాం. అంతేకాక నోటీస్ ఇచ్చి కాంట్రాక్టర్ నుంచి డబ్బులు కట్టించాం. ఆడిట్ ఉద్యోగులు కొత్తగా వచ్చారు. వారికి ఇక్కడ పరిస్థితి, పాస్‌వర్డులు తెలియక జీతాలు వెనక్కు పంపుతున్నారు.

– వాణి, ఆలయ ఈఓ, కసాపురం దేవస్థానం

ఇంకెంత కాలమీ దౌర్జన్యాలు?!

- దాడులు చేసి బాధితులపైనే కేసులు పెట్టడం హేయం
- బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్ ఎదుట మాజీ మంత్రి శైలజానాథ్ నిరసన
- అండగా ఉంటామని బాధితులకు భరోసా



బుక్కరాయసముద్రం పోలీసుస్టేషన్ ఎదుట బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న మాజీ మంత్రి శైలజానాథ్

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై, కార్యకర్తలపై ఎక్కడ చూసినా దాడులు జరుగుతున్నాయని శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ అన్నారు. మంగళవారం ఆయన బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. అంతకుముందు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ పుల్లయ్యను కలసి వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై జరిగిన దాడిని వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లిలో టీడీపీ నాయకులు చేసిన దాడిలో ఎనిమిది మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. టీడీపీ నాయకులు మూకుమ్మడిగా కొడవళ్లు, కట్టెలతో దాడి చేశారని, తలలు పగిలేలా కొట్టారన్నారు. అయినా తిరిగి బాధితులపైనే కేసులు పెట్టి అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. టీడీపీ నాయకులు ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని, లేదంటే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అనంతరం బాధితుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు పార్వతి, నాయకులు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, పూల నారాయణస్వామి, నందినేని మల్లికార్జున, చికెన్ నారాయణస్వామి, ముత్యాల శీన తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లపై ప్రభుత్వాల దాడి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్లపై దాడి చేస్తున్నాయి. పెన్షనర్లను భారంగా భావిస్తున్నాయి. రావాల్సిన రాయితీలు, డీఆర్ వంటి ఆర్థిక ప్రయోజనాలు ఇవ్వడం లేదు. అధికారం చేపట్టి ఏడాదవుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసంగా పట్టించుకోలేదు. వృద్ధులు వీరేమి చేస్తారనని అనుకోకండి. మేం తల్చుకుంటే మిమ్మల్ని గద్దె దింపుతాము'' అంటూ కూటమి ప్రభుత్వంపై పెన్షనర్ల సంఘం నాయకులు ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడ్ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుదీర్ఘకాలం సేవలందించిన ఉద్యోగులకు పదవీ విరమణ చేసిన తరువాత రాయితీలు మంజూరు చేయకుండా ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం బాధాకరమన్నారు. ఎన్నో పోరాటాలు చేసిన సాధించుకున్న వాటిని ఒక్కొక్కటిగా రద్దు చేయడం ప్రభుత్వాల నిరంకుశ వైఖరికి నిదర్శమన్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్న గౌడ్, శీలా జయరామప్ప మాట్లాడుతూ కూటమి గెలుపుకోసం గత ఎన్నికల్లో రాష్ట్రం మొత్తం తిరిగామన్నారు. అధికారంలోకి వస్తే ప్రయోజనాలు చేకూరుస్తామని చంద్రబాబు మాటిచ్చి ఏడాదవుతున్నా పట్టించుకోలేదని మండిపడ్డారు. పెన్షనర్లకు రావాల్సిన మూడు డీఆర్‌లు, 11వ పీఆర్‌సీ బకాయిలు తక్షణం చెల్లించాలన్నారు. అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరించాలన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నాయకులు అందజేశారు. ధర్నాకు ఏపీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్, నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ఇతర ఉద్యోగ సంఘాలు, సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ధర్నాలో పెన్షనీర్ల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారి, సీనియన్ సిటిజన్ అధ్యక్షుడు రమణ, రామకృష్ణ, నియోజకవర్గాల నాయకులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

వర్సిటీలకు కొత్త కోర్సుల శోభ

- గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల తోనే కొత్త కోర్సులు అందుబాటులోకి
- కంప్యూటర్ సైన్సెస్‌లో ఎస్కేయూలో రెండు, జేఎన్‌టీయూలో ఒక కోర్సు అమలు
- ఈసీఈ, సీఎస్ఈ బ్రాంచ్‌ల్లో సీట్ల పెంపు



కొత్త కోర్సుల అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ ఇంజనీరింగ్ కళాశాలలో కేక్ కట్ చేస్తున్న ఎస్కేయూ వీసీ ఆచార్య అనిత

అనంతపురం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితంగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలల్లో నూతన కోర్సులు అమలులోకి వచ్చాయి. 2025–26 విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సుల్లో విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నారు. కంప్యూటర్ సైన్సెస్ కోర్సులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడిన ప్రస్తుత రోజుల్లో ఇంజినీరింగ్ విద్య స్వరూపమే మారిపోయింది. దీంతో కాలేజీ యాజమాన్యాలు సీఎస్ఈ సీట్లను ఏటా పెంచుకుంటూ వెళ్తున్నాయి. దీంతో ప్రభుత్వ వర్సిటీల్లోనూ కంప్యూటర్ సైన్సెస్ సీట్లు పెంచేలా గత వైఎస్సార్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కొత్త కోర్సులను ప్రవేశపెట్టడానికి ఏఐసీటీఈ అనుమతులు, పాలకమండలి ఆమోదం తదితర ప్రక్రియ పూర్తి చేసేలా అప్పటి ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. తాజాగా కొత్త కోర్సుల అమలుకు ఉన్నత విద్యామండలి అనుమతులు జారీ చేసింది. దీంతో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రెండు, జేఎన్‌టీయూలో ఒక కోర్సును ప్రవేశపెట్టారు.

ఎస్కేయూలో కొత్తగా 240 సీట్లు

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాలలో కొత్తగా రెండు బీటెక్‌లో కంప్యూటర్ సైన్సెస్ డేటా సైన్సెస్, కంప్యూటర్ సైన్సెస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ ప్రోగ్రామ్‌లను సెల్ఫ్ ఫైనాన్స్ కింద ప్రవేశపెట్టారు. ఒక్కో కోర్సులో 60 సీట్లు కేటాయించారు. ఇది వరకు ఉన్న ఈసీఈ, సీఎస్ఈ ప్రోగ్రాంలలో 60 నుంచి 120 సీట్లకు పెంపుదల చేశారు. ఈ 240 కొత్త సీట్లకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది.

జేఎన్‌టీయూలో 198 సీట్లు

జేఎన్‌టీయూ (ఏ)లో కొత్త కోర్సుల అమలుకు 2023లోనే అప్పటి వర్సిటీ ఉన్నతాధికారులు అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. కోర్సు అనుమతి, ఏఐసీటీఈ ఆమోదం, పాలకమండలి ఆమోదం తదితర ప్రక్రియలన్నింటినీ పూర్తి చేసుకున్న అనంతరం తాజాగా ఉన్నత విద్యామండలి ఈ ఏడాది అడ్మిషన్లకు అనుమతిచ్చింది. దీంతో జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ అనే కొత్త కోర్సును సెల్ఫ్‌ఫైనాన్స్ కింద ప్రవేశపెట్టారు. కోర్సు ఫీజు రూ.75 వేలుగా నిర్ధారించారు. కన్వీనర్ కోటాలో 66 సీట్లను కేటాయించారు. వీటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది. అలాగే కంప్యూటర్ సైన్సెస్‌లో ఇప్పుడు ఉన్న సీట్లకు అదనంగా 66 సీట్లు కొత్తగా కేటాయించారు. ఒక్కో సీటుకు రూ.1.50 లక్షలుగా ఫీజు నిర్ధారించారు. సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరిలో ఈ సీట్లు కేటాయిస్తారు. వీటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. ఈసీఈలోనూ ప్రస్తుతమున్న సీట్లకు అదనంగా 66 సీట్లు కేటాయించారు. కోర్సు ఫీజు రూ.1.25 లక్షలుగా నిర్దేశించారు. వీటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. కాగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందు చూపు కారణంగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో 308 మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు కంప్యూటర్‌సైన్సెస్ కోర్సు అభ్యసించే అవకాశం దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అధినేతకు కృతజ్ఞతలు తెలిపిన ఆలూరు



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆలూరు సాంబశివారెడ్డి కలిశారు. తనకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మూడు రోజుల శిక్షణకు జేసీ

అనంతపురం అర్బన్: ప్రాజెక్టులకు భూ సేకరణ అంశంపై మూడు రోజుల ఇన్‌సర్వీస్ శిక్షణకు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ముస్సోరి తరలి వెళ్లారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకూ శిక్షణలో పాల్గొననున్నారు. తిరిగి ఈనెల 19న విధులకు హాజరు కానున్నారు.

భోజనం ప్లేటు కోసం గొడవ



చికిత్స పొందుతున్న విద్యార్థి రామన్న

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన వేళ ప్లేటు కోసం ఇద్దరు విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. పదో తరగతి విద్యార్థి బి.రామన్న ఎడమ చేతికి తీవ్ర గాయమైంది. పదో తరగతి చదువుతున్న రామన్న, రిహాన్ భోజనం ప్లేటు తనదంటే తనదంటూ లాక్కునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అప్పటికే డ్యామేజీ అయిన పదునైన ప్లేటు రామన్న ఎడమ చేతికి బలంగా తగిలింది. తీవ్ర గాయం కావడంతో ఆ విద్యార్థిని ఉపాధ్యాయులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. సుమారు 12 కుట్లు పడ్డాయి. మధ్యాహ్న భోజన వేళ ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉన్నట్లయితే ఈ ఘటన జరిగేది కాదని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలని డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర కోరారు.

ఖతార్‌లో వెల్డర్‌గా ఉద్యోగావకాశం

అనంతపురం: ఖతార్ దేశంలో వెల్డర్ ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధికారి పీపీ ప్రతాప రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 24 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు, ఐటీఐ లేదా ఐటీసీ విద్యార్హత కలిగి నాలుగేళ్ల అనుభవమున్న వారు అర్హులు. టిగ్/ఏఆర్‌సీ మల్టీ వెల్డర్ ఉద్యోగానికి నెలకు రూ.52 వేల నుంచి రూ.61,500, టిగ్/ఏఆర్‌సీ వెల్డర్ ఉద్యోగానికి నెలకు రూ.42,500 నుంచి రూ.52 వేలు జీతం చెల్లిస్తారు. రెండేళ్ల కాంట్రాక్ట్ పరిధిలో ఉచిత వసతి, భోజనం, వైద్యం, రవాణా, స్వదేశానికి ఒకసారి టికెట్ సదుపాయం కల్పిస్తారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 95502 15161, 91609 12690, 99888 53335లో సంప్రదించవచ్చు.

బీటెక్ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో జూన్‌లో నిర్వహించిన బీటెక్ ఒకటో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–23) రెగ్యులర్, (ఆర్–20), (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ ఫలితాలు, ఒకటో సంవత్సరం మొదటి సెమిస్టర్ (ఆర్–23), (ఆర్–20), (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి. నాగప్రసాద్‌నాయుడు మంగళవారం విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ జి.రాజు, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనే లక్ష్యం


- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



జాబ్‌మేళా క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

అనంతపురం అర్బన్: జిల్లా యంత్రాంగం చేపట్టనున్న జాబ్‌మేళాలపై విస్తృత ప్రచారం కల్పించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం జరిగిన జిల్లా నైపుణ్య కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ఎనిమిది జాబ్ మేళాలను ఏర్పాటు చేసి ప్రైవేటు, అవుట్ సోర్సింగ్ లేదా ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధి కల్పనాధికారిని ఆదేశించారు. ఈ నెల 18న కళ్యాణదుర్గం నియోజకవర్గం, 28న రాప్తాడు, ఆగస్టు 1న అనంతపురం అర్బన్, 16న గుంతకల్లు, 29న రాయదుర్గం, సెప్టెంబరు 12న శింగనమల, 19న తాడిపత్రి, 27న ఉరవకొండ నియోజకవర్గాల్లో జాబ్‌మేళాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నెలా ప్లేస్‌మెంట్ నివేదిక అందించాలన్నారు. ఆగస్టు నాటికి డిగ్రీ కళాశాలల్లో స్కిల్ హబ్ సెంటర్లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శైలజ, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసయాదవ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముకుద, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జేఎన్‌టీయూ టీపీఓ శ్రీనివాసులు, ఎస్కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణుడు, జేడీఎం సూర్యనారాయణ, మెప్మా డీవైఎస్ఓ పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతా ఉంటేనే 'తల్లికి వందనం'



మాట్లాడుతున్న ఎస్సీ వేల్ఫేర్ డీడీ రామాంజినేయులు

అనంతపురం రూరల్: ఇంటర్మీడియట్ చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు బ్యాంక్ లేదా పోస్టల్ ఖాతా ఉంటేనే తల్లికి వందనం పథకం నగదు జమ అవుతుందని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఇన్‌ఛార్జ్) రామాంజినేయులు తెలిపారు. మంగళవారం బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సహాయ సంక్షేమశాఖ అధికారులు, హాస్టల్ వార్డెన్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. త్వరలో రెండో విడత తల్లికి వందనం పథకం అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ విషయాన్ని వార్డెన్లు, సహాయ సంక్షేమశాఖ అధికారులు దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు బ్యాంక్, లేదా పోస్టల్ ఖాతా చేయించి ఎన్‌పీసీఐ లింక్ చేయించాలన్నారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల్లో 'మజ్దూర్' ప్యానెల్ విజయం



సెక్రెటరీ నయబ్ రసూల్



కోశాధికారి కృష్ణ

గుత్తి: రైల్వే ఇన్‌స్టిట్యూట్ కార్యవర్గ ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్యానెల్‌లోని 9 మంది ఘన విజయం సాధించారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ కార్యవర్గం ఎన్నికలు మంగళవారం జరిగాయి. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్ తరఫున అభ్యర్థులు బరిలో నిలిచారు. సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, కోశాధికారి, ఆరుగురు డైరెక్టర్ల పదవులకు నిర్వహించిన ఈ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 790 మంది ఓటర్లు ఉండగా 747 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 5 నుంచి ఏడు గంటల వరకు కౌంటింగ్ ప్రక్రియ చేపట్టారు. ఎంప్లాయిస్ సంఘ్ అభ్యర్థులు 9 మంది పోటీ చేసినా ఒక్కరూ గెలవలేకపోయారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్యానెల్ తరఫున సెక్రెటరీగా నయబ్ రసూల్ తన ప్రత్యర్థి వేణుగోపాల్‌పై 128 ఓట్ల మెజార్టీతో గెలిచారు. జాయింట్ సెక్రెటరీగా ఎస్.విజయకుమార్ 150 ఓట్ల మెజార్టీ, కోశాధికారిగా పోటీ చేసిన కేఎస్ కృష్ణ 148 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. డైరెక్టర్లుగా పోటీ చేసిన టి.కంబయ్య, పి.వెంకటేష్, టి.రామాంజనేయులు, పి.సుంకన్న, జ్ఞాన్‌సింగ్ మీనా, ఎం.బాలకృష్ణ ఘన విజయం సాధించారు. ఎన్నికల అధికారిగా ఏడీఎంఈ నేత చంద్ర వ్యవహరించారు.

ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధంకండి

- రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పిలుపు



స్థానిక నాయకులతో మాట్లాడుతున్న ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

రాయదుర్గం టౌన్: కూటమి పాలనలో దగాపడిన ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాయదుర్గం ప్రాంతంలోని మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాల దర్శనం కోసం మంగళవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసిన ఆయన స్థానిక మెట్టు గోవిందరెడ్డి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెట్టు విశ్వనాథరెడ్డితో కలిసి స్థానిక నాయకులతో కాసేపు మాట్లాడారు. ఏడాది కూటమి పాలన మొత్తం మోసాల మయమన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్కు చెరిపితే చెరిగి పోయేది కాదన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో సొంతంగా ఒక్క పథకాన్ని కూడా తీసుకురాలేని చంద్రబాబు... జగన్ ప్రవేశపెట్టిన పథకాలనే తమవిగా చెప్పుకునే దౌర్భగ్యస్థితికి దిగజారారని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, చేనేత విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పొరాళ్ల శివకుమార్, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, వీరభద్రరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, మండల కోఆప్షన్ సభ్యుడు దిలావర్‌బాషా, మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి తాశ బషీర్ అహ్మద్, పట్టణ కార్యదర్శులు, ఆంజనేయులు, సత్యనారాయణ, వార్డు ఇన్‌చార్జ్‌లు గౌని శ్రీరామిరెడ్డి, రామాంజనేయులు, గోనబావి నిజాముద్దీన్, కార్యవర్గ సభ్యుడు జిలాన్, బంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాదకద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గురుప్రసాద్

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ బాలుర ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గురుప్రసాద్, ఎస్బీ ఎస్ఐ హనుమంతు సూచించారు. ఈగల్ క్లబ్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు 'మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా' అనే అంశంపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలతో జరిగే పరిణామాలు, నష్టాలను వివరించారు సదస్సులో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జోగి శివప్రసాద్, సీనియర్ లెక్చరర్ ఉషాకుమారి పాల్గొన్నారు.

బీమా గడువు పొడిగించాలి


లీడ్ బ్యాంక్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: రైతులకు వాతావరణ బీమా గడువును ప్రభుత్వం ఆగస్టు 15 వరకూ పొడిగించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. మంగళవారం లీడ్ బ్యాంక్ కార్యాలయ అధికారికి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ రుణాలు వడ్డీతో సహా చెల్లించాలని బ్యాంకులు నిబంధన పెట్టడంతో చాలా మంది రైతులు రెన్యూవల్ చేసుకోలేదన్నారు. బీమా ప్రీమియం చెల్లించలేదని, దీంతో వాతావరణ ఆధారిత బీమా పొందలేని పరిస్థితి ఉందన్నారు. రైతులు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం బీమా ప్రీమియం గడువును పొడిగించాలన్నారు. నాయకులు నారాయణస్వామి, రాము, వెంకటరాముడు, రామాంజనేయులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థోలో మృతిపై విచారణ


విచారణ చేపడుతున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ఆర్థో వార్డులో ఈ నెల 9న రాజేష్(22) అనే యువకుడి మృతిపై మంగళవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో విచారణ కమిటీ సంబంధిత వైద్యులు, సిబ్బందిని విచారణ చేసింది. మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ భీమసేనాచార్ చాంబర్‌లో విచారణ కమిటీలో ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ నవీన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివశంకర్ నాయక్ వివరాలు సేకరించారు. అడ్మిషన్ రోజు నుంచి సర్జరీ, ఆ తర్వాత అందించిన సేవలు, తదితర వాటిపై విచారణ చేపట్టారు. ఆర్థో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీలు, అనస్థీషియా వైద్యులు, స్టాఫ్‌నర్సులు తదితరులు విచారణలో పాల్గొన్నారు.

ఎంపీడీఓలకు ముగిసిన శిక్షణ

అనంతపురం సిటీ: స్థానిక జెడ్పీ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీ భవన్‌లో ఎంపీడీఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈసందర్భంగా జెడ్పీ సీఈఓ శివశంకర్ మాట్లాడుతూ పంచాయతీ పురోగతి సూచిక 2.0 అనే అంశంపై ఇచ్చిన శిక్షణను ఎంపీడీఓలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనర్లు నిర్మల్‌దాస్, నరేంద్ర, గంగిరెడ్డి, విష్ణు పాల్గొన్నారు.

వైద్యులకు ఒంటిపూట విధులా?

- జీజీహెచ్‌లోని కొన్ని విభాగాల్లో మధ్యాహ్నం తర్వాత కనిపించని వైద్యులు


డెర్మటాలజీలో పత్తాలేని సీనియర్ వైద్యులు


ఈఎన్‌టీ ఓపీలో ఖాళీగా ఉన్న వైద్యుల కుర్చీలు


ఈఎన్‌టీ విభాగంలో వేచి ఉన్న రోగులు

అనంతపురం మెడికల్: వేసవిలో ఎండకు ఇబ్బంది పడకుండా విద్యార్థులకు ఒంటి పూట బడులను నిర్వహించడం పరిపాటి. అయితే ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అన్ని సీజన్లలోనూ కొన్ని విభాగాల వైద్యులు మాత్రం ఒంటిపూట విధులు నిర్వర్తిస్తూ విమర్శలకు తావిస్తున్నారు. వైద్యులు లేకపోవడంతో ఆయా విభాగాల ఓపీ గదులు ఖాళీగా కన్పిస్తున్నాయి. ఒక వేళ గదులు తెరిచినా.. అందులో పీజీ వైద్యులే కన్పిస్తుంటారు.

ఆ ఐదు విభాగాల్లో పరిస్థితి దారుణం

సర్వజనాస్పత్రిలోని సైకియాట్రి, దర్మటాలజీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, పల్మనాలజీ, రేడియాలజీ, తదితర విభాగాల్లో మధ్యాహ్నం తర్వాత వైద్యులు పత్తా లేకుండా పోతున్నారు. వాస్తవానికి ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వారు విధుల్లో ఉండాలి. కానీ, ఆస్పత్రి ఉన్నతాధికారుల బాధ్యతారాహిత్యం వీరికి వరంగా మారింది. ఉదయం విధులకు హాజరుకావడం.. మధ్యాహ్నం 12.30 గంటలకు వెళ్లిపోవడం పరిపాటిగా మారిపోయింది. ఎలాంటి కేసులనూ అడ్మిట్ చేసే పరిస్థితి లేని దర్మటాలజీ విభాగంలో వైద్యులు కనీసం ఓపీల్లో అందుబాటులో ఉంటూ పీజీ విద్యార్థులకు అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే అలాంటి పరిస్థితి ఇక్కడ లేదు. రేడియాలజీలోనూ హెచ్‌ఓడీ తన ప్రత్యేక గదిని విడిచి బయటకు రారు. ఇక అసిస్టెంట్ ప్రొఫెసర్లు వారి సొంత స్కాన్ సెంటర్లకు పరుగులు పెడుతున్నారనే విమర్శలున్నాయి. మధ్యాహ్నం తర్వాత వీరి విధులను రద్దీగా ఉన్న విభాగాల్లో వినియోగించుకుంటే బాగుంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

వైద్యుల బాటలోనే పీజీలూ..

జీజీహెచ్‌లో సీరియస్ కేసులను సైతం పీజీ విద్యార్థులకు అప్పగించి వైద్యులు వెళ్లిపోతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఫైనలియర్ పీజీలు సైతం వైద్యుల బాటలోనే నడుస్తున్నారు. తమ జూనియర్లకు పూర్తి బాధ్యతలిచ్చి వారు కూడా పత్తాలేకుండా పోతున్నారు. పల్మనాలజీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, సైకియాట్రి విభాగంలో వైద్యులది అదే పరిస్థితి. వాస్తవానికి మధ్యాహ్నం వేళలో వీరు యూజీ విద్యార్థులకు బోధనాతరగతులు చేపట్టాలి. అలాంటిది ఉదయం డ్యూటీలకు హాజరు కాగానే బయోమెట్రిక్ అటెండెన్స్ కాగానే ఓపీలను ఎగ్గొట్టి ఇంటికి వెళ్లిపోతున్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల సమయంలో ఆస్పత్రికి వచ్చి డ్యూటీ దిగిపోతున్నట్లుగా బయోమెట్రిక్ అటెండెన్స్ వేస్తుండడం గమనార్హం.

ప్రజారోగ్యాన్ని తేలిగ్గా తీసుకున్న జిల్లాధికారి?

కలెక్టర్ వినోద్‌కుమార్ గతంలో డాక్టర్‌గా పని చేశారు. ఆ సమయంలో తాను రోగులకు అందించిన సేవలపై ఎన్నో సార్లు వివిధ కార్యక్రమాల్లో చాలా గొప్పగా చెప్పుకున్నారు. గతంలో అసిస్టెంట్ కలెక్టర్‌గా ఉన్న సమయంలోనూ జీజీహెచ్‌లో బాధ్యరాహిత్యంగా ఉన్న వైద్యులను ఆయన ముచ్చెమటలు పట్టించారు. కాగా, కలెక్టర్‌గా వచ్చినప్పటి నుంచి ఆయన ఆస్పత్రిలో నెలకొన్న దుర్భర పరిస్థితులపై ఏనాడు దృష్టి సారించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజారోగ్యాన్ని తేలిగ్గా తీసుకున్నట్లుగా పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని గుంతకల్లు, తదితర ప్రాంతాల్లో సాధారణ పౌరుడిగా వెళ్లి తనిఖీలు చేపట్టి అందరి ప్రశంసలు అందుకున్న కలెక్టర్ వినోద్‌కుమార్.. సర్వజనాస్పత్రిపై దృష్టి సారిస్తే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని అంటున్నారు.

భూ సంరక్షణ విభాగంలో హోదా మార్పు

- జిల్లాకు ఒక ఈఈ, ఒక డీఈఈ పోస్టు కేటాయింపు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ పరిధిలో పనిచేస్తున్న భూ సంరక్షణ విభాగం (సాయిల్ కన్సర్వేషన్ వింగ్)లో అధికారుల హోదాల్లో మార్పు చేస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏఓ) హోదాను అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఏఈఈ)గా మార్పు చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (ఏడీఏ)ను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (డీఈఈ)గా మార్చారు. అలాగే డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (డీడీఏ)ను ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఈఈ)గానూ, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (జేడీఏ)ను సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్ఈ)గా మారుస్తూ జీఓ జారీ చేశారు. ఈ క్రమంలో అనంతపురం జిల్లాకు ఒక ఈఈ, ఒక డీఈఈ పోస్టు కేటాయించారు. భూసార సంరక్షణ విభాగంలో ఇక నుంచి డీడీఏ, ఏడీఏ స్థాయి అధికారులు ఉంటారు. వారిని ఈఈగానూ, డీఈఈగానూ పిలవాల్సి ఉంటుందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

ఆర్డీటీకి మద్దతుగా పోస్టుకార్డు ఉద్యమం


పోస్టుకార్డులను ప్రదర్శిస్తున్న కేఎస్ఆర్ జూనియర్ కళాశాల బాలికలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ మంజూరు చేయాలని కోరుతూ జిల్లాలో ఆ సంస్థ అభిమానులు పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలం నుంచి 1,600 చొప్పున లక్ష పోస్టుకార్డులు రాయాలని నిర్ణయించారు. బుధవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అనంతపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి 1,500 మంది బాలికలు రాసిన పోస్టుకార్డులను ర్యాలీగా తీసుకెళ్లి బాక్స్‌లో వేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. విద్యా రంగానికి సాయమందించడంలో ఆర్డీటీ పాత్ర కీలకమన్నారు. కళాశాలలో ఆర్డీటీ సహకారంతో ఆడిటోరియంను నిర్మించారన్నారు. పోస్టుకార్డు ఉద్యమంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నాణ్యతలో మేటి భారతి సిమెంట్


తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లను అందిస్తున్న జిల్లా టెక్నికల్ ఇంజనీర్ వి.మోతీలాల్ నాయక్

ఆత్మకూరు: నిర్మాణ రంగంలో భారతి సిమెంట్ నాణ్యతకు మారుపేరు అని భారతి సిమెంట్ జిల్లా టెక్నికల్ ఇంజనీర్ వి.మోతీలాల్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరులోని జగదీశ్వర సిమెంట్స్ వద్ద తాపీ మేస్త్రీలకు భారతి సిమెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంటు రంగంలో అనతి కాలంలోనే వినియోగదారుల మన్ననలను అందుకుని అగ్రగామిగా భారతి అల్ట్రా ఫస్ట్ సిమెంట్ నిలుస్తోందన్నారు. జర్మన్ టెక్నాలజీ, రోబోటిక్ క్యాలిటీ కంట్రోల్, ట్యాంపర్ ప్రూఫ్ ప్యాకింగ్‌తో వినియోగదారులకు కచ్చితమైన తూకం, నాణ్యమైన ప్రమాణాలతో చెరవేస్తున్నట్లు తెలిపారు. ప్రతికూల వాతావరణంలో సైతం భారతి సిమెంటు నాణ్యతగా ఉంటుందన్నారు. భవన నిర్మాణ రంగంలో తీసుకోవాల్సి జాగ్రత్తలు, మెళకువలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తాపీమేస్త్రీలకు అవగాహన కల్పించారు. అనంతరం రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను తాపీ మేస్త్రీలకు పంపిణీ చేశారు. భారతి సిమెంట్ డీలర్ తైదుల శివారెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ మహేశ్‌రెడ్డి, తాపీమేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టులో వాయు కాలుష్యం రానీయొద్దు


కంపోస్టు యార్డులో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: కంపోస్టు యార్డులో వాయు కాలుష్యం రానివ్వకుండా ఎప్పటికప్పుడు నీటితో ఆర్పేలా చూడాలని సంబంధిత సిబ్బందిని కమిషనర్ బాలస్వామి ఆదేశించారు. మంగళవారం కంపోస్టు యార్డును ఆయన పరిశీలించారు. ఆ సమయంలో కంపోస్టులో పొగ వస్తుంటే ఇంజినీరింగ్, ప్రజారోగ్యాధికారులపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. బయో రెమిడేషన్ జరిగేలా చూడాలన్నారు. త్వరలో జిగ్మా సంస్థ కంపోస్టు యార్డులో బయో రెమిడేషన్ చేపట్టనుందన్నారు. తద్వారా కంపోస్టు యార్డు సమస్యకు పరిష్కారం చూపొచ్చన్నారు. అనంతరం కమిషనర్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఎప్పటికప్పుడు చెత్త చెదారాన్ని కంపోస్టుకు తరలించేలా చూడాలన్నారు. ప్రధానంగా ప్లాస్టిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకూడదన్నారు. ప్లాస్టిక్‌ను ఎవరైనా విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని, ఎస్ఈ రాజశేఖర్, ఈఈలు షాకీర్, నరసింహులు, ఎంహెచ్‌ఓ రంగస్వామి, పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న అభిమన్యదాస్, కంపెనీ ప్రతినిధులు

అనంతపురంరూరల్: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అందరిదీ అని హిందుస్థాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ (తాటిచెర్ల) ఎల్‌పీజీ పైప్‌లైన్ స్టేషన్ లొకేషన్ ఇన్‌చార్జ్ అభిమన్యుదాస్ అన్నారు. మంగళవారం హెచ్‌పీసీఎల్ ఎల్‌పీజీ పైప్‌లైన్ స్టేషన్‌లో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛభారత్ మిషన్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కంపెనీ ప్రతినిధులు నాగార్జునరెడ్డి, భరత్‌నాయక్, ముకుంద రాఘవ, సాయిప్రశాంత తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓను కలిసిన ఎంపీడీఓల సంఘం ప్రతినిధులు


సీఈఓ శివశంకర్‌కు కార్యవర్గ ఏర్పాటు ప్రతిని అందిస్తున్న ఎంపీడీఓల సంఘం ప్రతినిధులు

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్‌ను ఎంపీడీఓల సంఘం శ్రీసత్యసాయి జిల్లా ప్రతినిధులు మంగళవారం కలిశారు. తమ సంఘం ఏర్పాటుకు సంబంధించిన ప్రతిని అందజేసి, మాట్లాడారు. విధి నిర్వహణలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రాజకీయ ఒత్తిళ్లు, పదోన్నతులు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యను కూడా కలిసి తమ సమస్యలపై చర్చించారు.

ఎంపీడీఓల కార్యవర్గం ఏర్పాటు

ఎంపీడీఓల సంఘం శ్రీసత్యసాయి జిల్లా నూతన కార్యవర్గాన్ని అనంతపురంలోని డీపీఆర్‌సీ భవన్‌లో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరేంద్రకుమార్ (గోరంట్ల), ఉపాధ్యక్షుడిగా సాయి మనోహర్ (ధర్మవరం), ప్రధాన కార్యదర్శిగా నరేష్‌కృష్ణ (పెనుకొండ), సహాయ కార్యదర్శిగా నసీమ (తలుపుల), కోశాధికారిగా రఘునాథగుప్తా (నల్లచెరువు)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా రామారావు (అమరాపురం), శ్రీనివాసులు (బుక్కపట్నం), బాలకృష్ణుడు (చెన్నేకొత్తపల్లి) ఎన్నికయ్యారు.

ముగిసిన మొహర్రం


ఎం.చెర్లోపల్లిలో జలధికి వెళ్తున్న పీర్లు


సనప గ్రామంలో జలధికి వెళ్తున్న పీర్లు

రాప్తాడు: ఎం.చెర్లోపల్లి, అయ్యవారిపల్లిలో మొహర్రం వేడుకలు మంగళవారం ముగిశాయి. ఉదయం ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. భక్తులు స్వామివార్లకు చక్కెర, బెల్లం చదివించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించి ఊరేగించారు. అగ్రిగుండం పూడ్చి వేసిన తర్వాత పీర్లను జలధికి తరలించారు. సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు.

జలధికి తరలిన పీర్లు

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో పీర్ల జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున పీర్ల స్వాములకు గ్రామోత్సవం చేపట్టారు. సాయంత్రం పీర్ల దేవుళ్లను గ్రామంలో ఊరేగించి జలధికి తీసుకెళ్లారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సనప జనసంద్రంగా మారింది. పోలీసులు అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తును నిర్వహించారు.

యువతీ యువకుడికి గాయాలు

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు కామారుపల్లి సమీపంలో మంగళవారం చోటు చేసుకున్న యువతీయువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు, యువతి ద్విచక్ర వాహనంపై ఆత్మకూరు మీదుగా అనంతపురానికి బయలుదేరారు. కామారుపల్లి శివారులోకి చేరుకోగానే అదుపుతప్పి ఎదురుగా కళ్యాణదుర్గం వైపు వెళుతున్న మినీవ్యాన్‌ను ఢీ కొన్నారు. తీవ్రంగా గాయపడిన యువతి, యువకుడిని 108 వాహనంలో అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కుటుంబసభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

హెచ్‌ఎంపై ఎంఈఓల ఫిర్యాదు

గార్లదిన్నె: మండలంలోని పాత కల్లూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నరసింహులు, ఆయన కుమారుడు విశ్వనాథ్ తమపై దౌర్జన్యం చేశారంటూ ఎంఈఓలు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. వివరాలు.. మంగళవారం ఎంఈఓ-1 చంద్రానాయక్, ఎంఈఓ-2 వెంకటరమణ నాయక్ ఇద్దరు ద్విచక్రవాహనంలో పాఠశాల తనిఖీ కోసం వెళ్తుండగా ఉదయం 11.30 గంటలకు గుడ్డాలపల్లి క్రాస్ సమీపంలోకి చేరుకోగానే హెచ్‌ఎం నరసింహులు మరో ద్విచక్రవాహనంలో వెనుకల కూర్చొని కల్లూరు వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. దీంతో ద్విచక్రవాహనం ఆపాలని ఎంఈఓలు కోరినా ఆపకుండా హెచ్‌ఎం పాఠశాలకు వెళ్లిపోయారు. ఎంఈఓలు కూడా పాఠశాలకు చేరుకుని హెచ్‌ఎం నరసింహులతో మాట్లాడుతూ.. పాఠశాల సమయంలో ఎందుకు బయటకెళ్లారని ప్రశ్నిస్తుండగానే అక్కడే ఉన్న హెచ్‌ఎం కుమారుడు విశ్వనాథ్ ఎంఈఓల సెల్‌ఫోన్ లాక్కొని కిందకు పడేసి దౌర్జన్యానికి దిగాడు. దీంతో ఎంఈఓల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, హెచ్‌ఎం నరసింహులు తమకు అందాల్సిన ఇంక్రిమెంట్లు విషయంగా ఇప్పటికే హైకోర్టులో కేసు వేసినట్లు సమాచారం.

బాలిక అదృశ్యం

అనంతపురం: నగరంలోని రంగస్వామినగర్‌కు చెందిన శ్రీనివాసులు కుమార్తె జగిలేటి షాలిని(17) అదృశ్యమైంది. సోమవారం రాత్రి కాలనీలో ఏర్పాటు చేసిన పీర్లస్వాములను చూసి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ కే. శాంతిలాల్ తెలిపారు. ఆచూకీ తెలిస్తే సీఐ-9490618679, ఎస్ఐ 9346917115 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఘనంగా ప్రపంచ నైపుణ్య దినోత్సవం

ఆత్మకూరు: స్థానిక కేజీబీవీలో మంగళవారం ప్రపంచ నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీవీఈఓ వెంకట రమణ నాయక్, ఏజీఎంఓ రంగయ్య నైపుణ్య దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు వృత్తి విద్యలో క్విజ్, రోల్ ప్లే, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటస్వామి, జీసీడీఓ కవిత, ఏంఈఓ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ లీమా రోజ్, ఒకేషనల్ కోఆర్డినేటర్ రఘు, శ్రీధర్, వృత్తిల విద్య ఉపాధ్యాయురాలు గౌతమి, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో అపార అవకాశాలు

అనంతపురం కల్చరల్: నైపుణ్య పెంపుదలతోనే అపార అవకాశాలు లభిస్తాయని వక్తలు అన్నారు. చైల్డ్ ఆఫ్ ఇండియా, మై భారత్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవాన్ని నిర్వహించారు. మై భారత్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ గోవర్ధన శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మై భార్ స్టేట్ కోఆర్డినేటర్ బిసాతి భరత్, జేఎన్‌టీయూ అనంతపురం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. మమత, అరవింద్ మాట్లాడారు. అనంతరం యువతీయువకులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్ కుమార్, జయమారుతి, కనకశివమ్మ, వంశీ, అంబరీష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

శివారెడ్డి సేవలు మరువలేనివి

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరీక్షల విభాగంలో అటెండర్‌గా పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి భూమిరెడ్డి శివారెడ్డి సేవలు మరువలేనివని వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు పేర్కొన్నారు. శివారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. శివారెడ్డి కుటుంబానికి వీసీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

తలుపులు తెరచుకోని సచివాలయాలు

- కొన్ని సచివాలయాల్లో కన్పించని సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మధ్యాహ్నం 1 గంట అయినా తలుపులు తెరచుకొని ఎం.చెర్లోపల్లి గ్రామ సచివాలయం

రాప్తాడు: మహాత్మ గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. క్షేత్ర స్థాయిలోనే సంక్షేమ పాలన అందించేందుకు గ్రామ, వార్డు స్థాయిలలోనే సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఒక్కో సచివాలయానికి 13 మంది సిబ్బందిని నియమించి ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందించారు. కూటమి సర్కార్ ఏర్పాటైన తరువాత సచివాలయ వ్యవస్థ ఛిన్నాభిన్నమైందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. తగినంత మంది సిబ్బంది లేక సేవలు పడకేశాయి.

కనిపించని ఉద్యోగులు..

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని రాప్తాడు మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామ సచివాలయం తలుపులు మంగళవారం తెరవలేదు. మరూరు గ్రామ సచివాలయం తలుపులు తెరిచినా అందులో పంచాయతీ కార్యదర్శి శైలజా మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మిగతా సచివాలయ సిబ్బంది ఎవరూ హజరు కాలేదు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారులు ఎవరూ కార్యాలయంలో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎం.చెర్లోపల్లిలో మహిళలు తల్లికి వందనం డబ్బులు జమ కాకపోవడంతో గ్రామ సచివాలయానికి వచ్చారు. మధ్యాహ్నం 1 గంట అయినా తలుపులు తెరచుకోకపోవడంతో సచివాలయానికి వచ్చిన ప్రజలు మధ్యాహ్నం వరకు సచివాలయం దగ్గర అధికారుల కోసం వేచి చూసి ఇంటికి వెళ్లారు. ఈ విషయంపై ఎంపీడీఓ విజయలక్ష్మిని వివరణ కోరగా ఎం.చెర్లోపల్లి సచివాలయ పంచాయతీ కార్యదర్శి బెళుగుప్పకు బదిలీపై వెళ్లారని, సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఈ నెల 14వ తేదీ సాయంత్రం మొత్తం ట్రాన్స్‌ఫర్ కావడంతో వీరందరినీ రిలీవ్ చేయడంతో ఈ రోజు సచివాలయానికి ఎవరూ రాలేదని చెప్పుకొచ్చారు. కొత్త సిబ్బంది ఈ రోజు వస్తున్నారని, సిబ్బంది వచ్చిన వెంటనే కార్యాలయ తలుపులు తెరిపిస్తామన్నారు. ఆ సచివాలయానికి మరూరు గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శి శైలజను ఇన్‌చార్జి వేశామని, ఆమె తలుపులు తెరవాల్సి ఉందని, ఆమె ఎందుకు తలుపులు తెరవలేదో తెలుసుకుంటానని ఎంపీడీఓ తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండేవారని....ఈ ప్రభుత్వంలో ఎవరూ అందుబాటులో ఉండడం లేదని ఆయా గ్రామల ప్రజలు మండిపడుతున్నారు.

15 రోజుల నుంచి రావడం లేదు



గత 15 రోజుల నుంచి సచివాలయం సిబ్బంది బదిలీల పేరుతో విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. ఎదైనా పనిమీద సచివాలయానికి వస్తే ఎవరో ఒకరూ మాత్రమే విధుల్లో ఉంటున్నారు. మిగతా సిబ్బంది ఎక్కడా అని ప్రశ్నిస్తే మిగతా సిబ్బందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారని వారు ఆ పని మీద తిరుగుతున్నారని సమాధానం చెబుతున్నారు. ఈ రోజు మధ్యాహ్నం 1 గంట అయినా సచివాలయం తలుపులు తేరవలేదు. మాకు మరూరు పంచాయతీ కార్యదర్శిని ఇన్‌చార్జిగా నియమించారు. ఆమెన ఇంత వరకు చూడనేలేదు.

–బుడగ నాగరాజు, ఎం.చెర్లోపల్లి, రాప్తాడు మండలం